

సత్యదేవుని దర్శించుకున్న అశోక్ గజపతిరాజు

ప్రజాశక్తి - అన్నవరం


అశోక్ గజపతి రాజుకు జ్ఞాపికను అందిస్తున్న ఇఒ

అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామిని కేంద్ర మాజీ మంత్రి, సింహాచలం దేవస్థానం ఛైర్మన్ అశోక్ గజపతిరాజు సోమవారం దర్శించుకున్నారు. అన్నవరం కొండపై విచ్చేసిన ఆయనకు దేవస్థానం ఇఒ కె.రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వీరికి వేద ఆశీస్సులు నిర్వహించారు. అనంతరం ఆయనకు ఇఒ స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పిఆర్ఒ కృష్ణారావు ఆలయ అధికారులు, ఇఒ సిసి సాయిబాబా పాల్గొన్నారు.

కష్టాల కొలిమిలో జట్టు కార్మికులు

- రైస్ మిల్లుల్లో దుమ్ము, ధూళితో సావాసం
- అనారోగ్య సమస్యలతో సతమతం
- వైద్య శిబిరాలు నిర్వహించని యాజమాన్యాలు
- అమలు కాని కార్మిక చట్టాలు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న జట్టు కార్మికులు కష్టాల కొలిమిలో కొట్టుమిట్టాడుతున్నారు. నిత్యం దుమ్ము, ధూళితోనే సహవాసం చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని రేయింబవళ్లు చెమటోడ్చి కష్టపడుతున్నారు. ఆరోగ్యం క్షీణిస్తున్నా కుటుంబ పోషణ కోసం తప్పని పరిస్థితి. పొట్టకూటి కోసం నిత్యం శక్తికి మించి బరువులను మోస్తూ బ్రతుకు బండిని లాగుతున్నారు. కార్మిక చట్టాలు సక్రమంగా అమలు కాకపోవడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బాయిల్డ్, రైస్ మిల్లులు చిన్న పెద్ద అన్నీ కలిపి సుమారు 530 వరకు ఉన్నాయి. వీటిల్లో దాదాపుగా 35 వేల మందికి పైగా జట్టు కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో 20 శాతం మంది మహిళా కార్మికులు ఉన్నట్లు అంచనా. గొల్లప్రోలు, పిఠాపురం, కాకినాడ, సామర్లకోట, పెదపూడి, కరప, మండపేట, రాయవరం, ఆలమూరు, రాయవరం, కపిలేశ్వరపురం, బిక్కవోలు, అనపర్తి తదితర మండలాల్లో రైస్ మిల్లులు ఎక్కువగా ఉన్నాయి. పురుషులు ధాన్యం బస్తాల లోడింగ్, అన్ లోడింగ్, మిల్లింగ్ చేయడం తదితర పనులు చేస్తే, మహిళా కార్మికులు నూక, తవుడు ఎత్తడం, శుభ్రం చేయడం పనులు చేస్తుంటారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి



చట్టాలు సక్రమంగా అమలు కాక కార్మికులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. దుమ్ము, ధూళితో అనారోగ్యాల పాలవుతున్నా ఆరోగ్య శిబిరాలు నిర్వహణ లేదు. చట్టాలు సక్రమంగా అమలయ్యేలా ప్రభుత్వం, అధికారులు సరైన చర్యలు తీసుకోవాలి.

- సిహెచ్.రాజకుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, కాకినాడ జిల్లా

సౌకర్యాలు లేకుండానే

అసంఘటిత రంగంలోకి వచ్చే జట్టు కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చట్టాలున్నా అవి సక్రమంగా అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఒకవైపు రోజురోజుకీ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతుండడంతో పనికి తగ్గ కూలీ రాకపోవడంతో కార్మికుల జీవన స్థితిగతులు దెబ్బతింటున్నాయి. రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా కూలీ సరిపోక దిక్కుతోచని స్థితిలో వారు వాపోతున్నారు. అలాగే కనీస భద్రతా సౌకర్యాలు లేకుండానే పని చేస్తున్నారు.

నిత్యం ఆరోగ్య సమస్యలు

అధిక బరువులు మోయడం, దుమ్ము, దూగరలలో పనిచేయాల్సి రావడం వల్ల కార్మికులు అనారోగ్య సమస్యలతో తీవ్ర స్థాయిలో సతమతమవుతున్నారు. 40 ఏళ్ళు వచ్చేసరికి ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అందులో ప్రధానంగా ఊపిరితిత్తులు, కళ్లు, కీళ్లు, నడుము సంబంధిత సమస్యలు అధికంగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య సిబ్బందిని మిల్లు వద్దకు తీసుకువచ్చి వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉన్నా ఎక్కడ అమలు కావడం లేదని చెబుతున్నారు.

పని గంటలు ఎక్కువ

నిబంధనల మేరకు 8 గంటలు మాత్రమే పనిచేయాల్సి ఉండగా కొన్నిచోట్ల 18 గంటలు పనిచేయాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందంటున్నారు. మహిళలకు కనీస వేతనం, ప్రసూతి సెలవులు తదితర సదుపాయాలు అమలు కావడం లేదు. ఐఎల్ఓ నిబంధనల ప్రకారం 55 కేజీల బరువు మించకూడదు. అయితే పలు చోట్ల మిల్లుల యజమానులు నిబంధనలు పక్కన పెట్టి 75 నుంచి 80 కేజీల బరువులను కూడా మోయిస్తున్నారు.

చట్టాల అమలుపై నిర్లక్ష్యం

ఏ సంస్థలోనైనా 20 మందికి పైబడి కార్మికులు పనిచేస్తుంటే వారికి పిఎఫ్ తదితర అన్ని సౌకర్యాలు కల్పించడం, ప్రభుత్వ సెలవు దినాల్లో వేతనాలు చెల్లించడం వంటి చట్టాలు అమలు జిల్లాలో అంతంత మాత్రంగానే ఉందని కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. పనిచేసే చోట కార్మికుడు ప్రమాదానికి గురైతే అతనికి యాజమాన్యం నష్టపరిహారం చెల్లించడంతోపాటు ఆ కార్మికుడు పూర్తిగా కోలుకునే వరకూ అతడి కుటుంబానికి జీవన భృతి కల్పించాల్సి ఉంది. కార్మికుడు ప్రమాదానికి గురైనప్పుడు కేవలం ప్రాథమిక చికిత్స చేయించి యజమానులు చేతులు దులుపుకొంటున్నారని కార్మికులు విమర్శిస్తున్నారు. రెండు నెలలకోసారి కార్మికశాఖ అధికారులు ఆయా సంస్థల్లో పర్యవేక్షించి కార్మికుల హక్కుల అమలును పర్యవేక్షించాల్సి ఉండగా అధికారులు తనిఖీలు చేస్తున్న దాఖలాలు లేవనే విమర్శలు లేకపోలేదు.


జిల్లా మత్స్య శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మత్స్యకార సంఘీయులు

వేట నిషేధభృతిని తక్షణమే ఇవ్వాలి

ప్రజాశక్తి - కాకినాడ

మత్స్యకారులకు చెల్లించాల్సిన వేట నిషేధ భృతి రూ.20 వేలను తక్షణమే ఇవ్వాలని మత్స్యకారుల, మత్స్య కార్మికుల సంఘం జాతీయ నాయకురాలు సిహెచ్.రమణి డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో జిల్లా మత్స్యశాఖ అధికారీ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేట నిషేధం అమలులోకి వచ్చిన 15 నుంచి 20 రోజులలో మత్స్యకారుల ఖాతాలో నిషేధ భృతి జమ అయ్యేదన్నారు. అయితే 4 నెలలు గడిచినా మత్స్యకారుల ఖాతాలో ఒక రూపాయి కూడా పడలేదన్నారు. ఎన్నికల ప్రచారంలో వేట నిషేద భృతి రూ.20 వేలు ఇస్తామని ఇచ్చిన హామీని సిఎం చంద్రబాబు తక్షణమే అమలు చేయాలని కోరారు. సంఘం జిల్లా నాయకులు ఉప్పాడ సత్యనారాయణ, సంగాడి ఈశ్వరరావు మాట్లాడుతూ వేట నిషేధం రెండు నెల కాలంలో అప్పులు చేసుకుని జీవనం సాగించారని, ప్రభుత్వం రేషన్ కార్డుకు ముడి పెట్టకుండా అర్హులైన వారందరికీ వేట నిషేధ భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే మత్స్యకారులు ఉద్యమం బాట పడతారన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మత్స్య శాఖ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, పి.రాజు, బి.చిన్నస్వామి, పి.కనకరాజు, అంగాడి ఈశ్వరరావు, నూకరాజు, పిఎన్.రావు, లక్ష్మణరావు, చెక్క నూకరాజు, వనమాడి శ్రీను పాల్గొన్నారు.

త్వరితగతిన అర్జీల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ, పిఠాపురం


అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోనూ, పిఠాపురంలో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. తొలుత కాకినాడ కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో డిఆర్ఒ డాక్టర్ డి.తిప్పేనాయక్, హౌసింగ్ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, కూడా విసి కృష్ణమూర్తి, సిపిఒ పి.త్రినాథ్, ఎస్‌సి ఈడి శ్రీనివాసరావు, డిఎల్‌డిఒలతో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా 263 అర్జీలు వచ్చాయి. అనంతరం పిఠాపురం రథాలుపేట అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఇట్ల కిషోర్, పెద్దాపురం డిఎల్‌డిఒ ప్రసాదరావులతో కలిసి ప్రజల నుంచి 208 అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తగిన పరిష్కారం చూపాలని ఆదేశించారు.


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

సామాన్యులకు అందుబాటులో వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - కాకినాడ

పేదలకు అవసరమైన వైద్య సేవలను అందుబాటు ధరల్లోనే అందించాలని రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం నగరంలోని భానుగుడి సెంటర్లో డాక్టర్ అగర్వాల్ ఐ కంటి ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ చాలామందికి కరోనా మహమ్మారి వల్ల కంటిపై ప్రభావం చూపిందన్నారు. అందువల్ల కంటికి వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వీడి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 10 దేశాల్లో 200 బ్రాంచులు అగర్వాల్ కంటి ఆసుపత్రిలను ఏర్పాటుచేసి మన్ననలను పొందడం చాలా సాహసమని ప్రశంసించారు. ఎపిలో మరిన్ని బ్రాంచులు విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు. ఎంఎల్ఎ వనమాడి కొండ బాబు మాట్లాడుతూ పేదలకు అందుబాటులో ఉండేలా ఆరోగ్యశ్రీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అందుకు అవసరమైన సహకారాన్ని ప్రజాప్రతినిధులుగా అందిస్తామని అన్నారు. అనంతరం మంత్రి దుర్గేష్‌ను ఆసుపత్రి సిఇఒ రాహుల్ అగర్వాల్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు జేమ్స్ సుబ్రత్‌కుమార్ ఆడమ్స్, కె.శ్రీనివాసరావు, మహమ్మద్ అజార్, అజీమునిషా మహమ్మద్, ఆసుపత్రి సిబ్బంది, ఇతరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - గండేపల్లి


బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం, ఇతర ప్రజా సంఘాల నాయకులు

దళితులపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని సూరంపాలెం గ్రామంలో దళిత పేటపై మూకుమ్మడిగా దాడి చేసిన సంఘటనపై సోమవారం దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, సిపిఎం జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుబ్బల రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి కూరాకుల సింహాచలం, జిల్లా నాయకులు జి.సత్యానందం సూరంపాలెం దళిత పేటలో పర్యటించారు. బాధితులను పరామర్శించి దాడికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ సాయంత్రం సూరంపాలెంలో రోడ్డు పక్క ఆగి ఉన్న దళిత యువకులపై అ కారణంగా సూరంపాలెం అగ్రవర్ణ యువకులు దాడి చేశారని, ఇదేమి అన్యాయమని ప్రశ్నించినందుకు మూకుమ్మడిగా అగ్రవర్ణ యువకులు దళిత పేటపై కర్రలు, రాడ్లుతో వీరంగం సృష్టించారని, మహిళలను దుర్భాషలాడారని అనంతరం సోషల్ మీడియాలో దళితులను కించపరుస్తూ అసభ్య పదజాలంతో పోస్టులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే నామమాత్రంగా కేసులు పెట్టారని, అలాగే దాడికి గురి అయిన మాపై అన్యాయంగా కేసులు పెట్టారని చెప్పారు. ఈ సందర్భంగా దళిత, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. ప్రభుత్వాలు మారిన దళితులపై దాడులు ఆగడం లేదని మరింత తీవ్రమవుతున్నాయన్నారు. దళితులపై దాడులు ఆగాలంటే దళితులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వాలు దళితులకు రక్షణగా ఉన్న చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ఇలాంటి ఘటనలలో దాడి చేసిన వారికి కఠినంగా శిక్షించాలని అప్పుడే దాడులు ఆగుతాయని అన్నారు. అనంతరం బాధితులతో గండేపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ శివ నాగుతో బాధితుల సమస్యలను వివరించారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ నిరోధక చట్టంతోపాటు హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి దళితులకు రక్షణ కల్పించాలన్నారు. సోషల్ మీడియాలో దళితులను కించపరిచే విధంగా పోస్టులు పెట్టిన వారిపై కూడా కేసులు పెట్టాలన్నారు. దళిత పేటలపై దాడులు పునరావృతం కాకుండా చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూరంపాలెం గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

కేరళ బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - తాళ్లరేవు



విరాళాలు సేకరిస్తున్న కౌలు రైతు సంఘం ప్రతినిధులు

కేరళ బాధితుల కోసం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేశారు. సోమవారం జార్జిపేట, నేలపల్లి చెక్‌పోస్ట్ ప్రాంతాల్లో విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రాజబాబు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం ఏదో ఒక రూపంలో ప్రకృతి విలయతాండవం వల్ల నష్టం జరుగుతుందన్నారు. అక్కడ ఉన్న ప్రభుత్వం ప్రజలను అన్ని విధాల ఆదుకుంటున్నప్పటికీ ఇంత పెద్ద నష్టం జరిగినందుకు మానవతా దృక్పథంతో అందరూ సహకరించాలని కోరారు. ఈ నిధి వసూళ్లకు సహకరించిన వ్యాపార వర్గాలు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సేకరించిన విరాళాలను రాష్ట్ర కేంద్రానికి అందచేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గుత్తుల సూర్యనారాయణ, పిల్లి నాని, సంతోష్‌కుమార్, కె.వెంకటేష్, కట్ట రాఘవేంద్ర, పండు వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

24న పిఠాపురంలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 24వ తేదీ శనివారం పిఠాపురం ఎస్ఎఫ్ఎస్ స్కూల్, అంజనా కాలేజీలలో వికాస ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కెఎల్.రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో హెచ్‌సిఎల్, టెక్‌మహీంద్రా, సదర్లాండ్ గ్లోబల్ సర్వీసెస్, స్వేయా ఇన్ఫోటెక్, సైబర్ క్యూబ్స్, డబ్ల్యూ.ఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్, ఇండిగో ఎయిర్లైన్స్ తదితర 40 ప్రముఖ కంపెనీలకు సంబంధించి సుమారు 2,500 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి నుంచి పీజీ వరకూ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులని, ఆసక్తి కల్గిన వారు ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరుకావలన్నారు.

కార్మికులకు షెల్టర్ కోసం వినతి

ప్రజాశక్తి - పిఠాపురం


ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న కరణం విశ్వనాథం

పట్టణంలోని స్థానిక రామా టాకీస్ సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికులకు షెల్టర్ ఏర్పాటు చేయాలని పిజిఆర్ఎస్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కరణం విశ్వనాథం కోరారు. మంగళవారం ఆర్‌డిఒ ఇట్ల కిషోర్‌ను పిజిఆర్ఎస్‌లో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుత ప్రతి రోజు రెండు, మూడు వందల మంది భవన నిర్మాణ కార్మికులు పని కోసం ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకూ రామా టాకీస్ సెంటర్లోనే ఉంటారన్నారు. కార్మికులు నుంచోడానికి కానీ, కూర్చోవడానికి కానీ స్థలం లేదన్నారు. సెంటర్‌లో ఉన్న దుకాణాల వద్ద కూర్చోవడం వల్ల వాళ్ళ వ్యాపారాలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. కావున ఆర్ఆర్ పార్క్ వద్ద షెల్టర్‌తోపాటు, తాగునీటి వసతిని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దేగల సత్యనారాయణ, కొయ్యల రమణ, కె.శ్రీను, పి.వీరబాబు, ఎస్.సత్తిబాబు, ఎం.వరప్రసాద్, డి. గోపాలకృష్ణ, డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం


ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

మండల పరిధిలో వైరల్ ఫీవర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నందున పాఠశాలలు, వసతి గృహాలలో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఎం కోరింది. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో నాయకులు ఆర్‌డిఒ జె.సీతారామారావును కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా, డెంగూ, టైఫాయిడ్ జ్వరాలతోపాటు వాంతులు, విరోచనాల కేసులు కూడా పెరుగుతున్నాయన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిరపరపు శ్రీనివాస్, కేదారి నాగు, క్రాంతి కుమార్, అరుణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తుల అందజేత

ప్రజాశక్తి - కరప

స్థానిక నక్కా సూర్య నారాయణమూర్తి జడ్‌పి ఉన్నత పాఠశాల ప్లస్ టులో మొదటి ఏడాది ఇంటర్ విద్యార్థులు 25 మందికి సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ద్వారా ఏకరూప దుస్తులను అందజేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో బాలికల విద్యను ప్రోత్సహించాలని లక్ష్యంతో ఫౌండేషన్ ద్వారా గత వారంలో ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందించామని ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులకు అవసరమైన ఏకరూప దుస్తులను అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత మున్సిపల్ కమిషనర్ వి.చక్రధర్‌రావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మాజీ సర్పంచ్ పి.తాతీలు, నాయకులు బి.కొండబాబు, బి.గంగాధర్, పి.దుర్గాప్రసాద్, హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ ఎం.శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి - జగ్గంపేట


జగ్గంపేటలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి అవసరమయ్యే స్థలాన్ని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సోమవారం పరిశీలించారు. గోకవరం రోడ్‌లో పంచాయతీ రాజీ అతిథి గృహం సమీపంలో ఉన్న స్థలాన్ని పబ్లిక్ హెల్త్ అసిస్టెంట్ ఇంజనీర్ బ్రహ్మ తేజతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకం గా చేపట్టిన అన్న క్యాంటీన్‌ను ఆగస్టు 15న రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్య పట్టణాలు, మున్సిపాలిటీలో ప్రారంభించినట్లు చెప్పారు. రెండో ఫేజ్‌లో జగ్గంపేట నియోజకవర్గంలో జగ్గంపేట, కిర్లంపూడి మండలాలకు అన్న క్యాంటీన్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ పర్యటనలో మారిశెట్టి భద్రం, పంచాయతీ సెక్రటరీ చిరంజీవిరాజు, ఇంజనీరింగ్ అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేసినట్లయితే అట్టివారిపై కఠిన చర్యలు తప్పవని ఏలేశ్వరం ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అసంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ఉక్కు పాదం మోపుతున్నట్లు ఆయన తెలిపారు. బెల్ట్ షాపులు నిర్వహణపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏలేశ్వరం మెయిన్ సెంటర్లో ట్రాఫిక్ క్రమిబద్ధీకరణ చేసేందుకు ప్రత్యేకించి చేపడుతున్నట్లు తెలిపారు.

కార్టూ'నిజం'




చిన్నారులతో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్

శ్రీ ప్రకాష్‌లో చిన్నారుల స్నాతకోత్సవం

ప్రజాశక్తి - కోటనందూరు

స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో 2023-24 విద్యా సంవత్సరం యుకెజి విద్యార్థులకు స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తమ విద్యా సంస్థలలో విద్యా భోదన ఆట పాటలతో జరుగుతుందని, ఈ విధానం వల్ల విద్యార్థుల్లో శారీరక, మానసిక పెరుగుదల, ఆలోచన శక్తి, సామాజిక స్పృహ అభివృద్ధి చెందుతాయని అన్నారు. తమ పిల్లలతో ప్రతిరోజు కొంత సమయాన్ని ఆట పాటలతో, కథలు చెప్తూ గడపాలని తల్లీదండ్రులకు సూచించారు. తద్వారా విద్యార్థులు ఆదర్శవంతమైన భావి భారత పౌరులుగా తీర్చి దిద్ద బడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫొటోలతో మధుర జ్ఞాపకాలు పదిలం

ప్రజాశక్తి - పెద్దాపురం



లూయిస్ డాగురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సూరిబాబురాజు

మన జీవితంలో ఎన్నో మధుర జ్ఞాపకాలను ప్రేమ్ లో నిక్షిప్తం చేసి ప్రతిబింబించేదే ఫోటో అని మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు అన్నారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో ఫోటో, వీడియో గ్రాఫర్స్‌అసోసియేషన్, పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోటోగ్రఫీపై అందరిలో ఆసక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థి దశ నుంచి ఫోటోగ్రఫీపై పిల్లలను ప్రోత్సహించాలన్నారు. తొలుత కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తీసిన ఫోటోలతో ఏర్పాటు చేసిన కాంటెస్ట్ ఫోటోలు ఎగ్జిబిషన్‌ను మిషన్ అన్నపూర్ణ సహాయనిది వ్యవస్థాపకులు దేవత రాజేష్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తోట సూర్య సుబ్బారావు, ఫోటో క్లబ్ మెంబర్ కర్రి నాగేశ్వరరావు, జిల్లా కోశాధికారి పేపకాయల బద్రి, యూనియన్ అధ్యక్షులు దేశపల్లి వరహాల రాజు, కార్యదర్శి ఎస్ఎల్.రెడ్డి, కోశాధికారి బళ్ల సతీష్, గౌరవాధ్యక్షులు అల్లాడ రమణ, జిల్లా కమిటీ సభ్యులు, చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్, అమృత, నేహా, రేణుక, సాయి పాల్గొన్నారు.

ఘాతుకంపై ప్రజాసంఘాల నిరసన

కోల్‌కత్తా జూనియర్ డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యాన్ని నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రజలు స్వచ్ఛంధంగా పాల్గొని సంఘీభావం తెలిపారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ రూరల్ మండలంలోని ఇంద్రపాలెం అల్లూరి సెంటర్లో మానవహారంగా ఏర్పడి కొవ్వొత్తులు వెలగించి మృతిరాలికి నివాళు లర్పించారు. ఇంతటి దారుణానికి ఒడిగట్టిన రాక్షస మూకలను కఠినంగా శిక్షించాలని, దర్యాప్తు వేగవంతం చేయాలని ప్రభుత్వాలను ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు డాక్టర్ వై.వసంత, ప్రముఖ రచయిత్రి అద్దేపల్లి జ్యోతి, వి.సోనీ, మేడిశెట్టి రామ్మోహన్, గవర బాబ్జి, సిహెచ్.విజయకుమార్, కె.కృష్ణమోహన్, సాహిత్, మెడికో నిక్షిప్త, పెద్దింశెట్టి రామకృష్ణ, వి.రవికుమార్ పాల్గొన్నారు. అలాగే తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి ఆమెకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు నాగజ్యోతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.అజయ్ కుమార్, కె.దమయంతి, సిహెచ్. శ్రీరమణి, సుబ్బలక్ష్మి, నాగమణి, రాఘవ, డేగల శ్రీను పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక ఉప్పాడ బస్టాండ్ సెంటర్ నుంచి రథాలపేట అంబేద్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ వరకూ సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ధర్నా చేసి కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయ కులు కుంచె చిన్న,



పెద్దాపురంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కోనేటి రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కె.నాగేశ్వర రావు, కె.మణి, సూర్యనారాయణ, జి వీరబాబు, స్టాలిన్, పి.సత్యనారాయణ, ఎస్.సత్తి బాబు, డి గోపాలకృష్ణ, పి.సూర్యచక్రం, గోవిందాచారి, రాజేష్, అప్పారావు, సోమరాజు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** జూనియర్ డాక్టర్ జరిగిన అఘాయి త్యానికి నిరసనగా సిపిఐ(ఎంఎల్) వినోద్‌మిత్ర పార్టీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకులు కొసిరెడ్డి గణేష్ మాట్లాడారు. **తాళ్లరేవు** కోరంగి పంచాయితీ ప్రతాప్ నగర్‌లో విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ చేశారు. ప్రతాప్ నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి మెయిన్ రోడ్డు పై తాళ్లరేవు దేవి మహల్ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. మహిళలకు రక్షణ కావాలని విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, విఎఎల సంఘం మండల అధ్యక్షులు కమిడి ఈశ్వరిబాయి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు దుప్పి అదృష్టదీపుడు, స్థానిక నాయకులు సత్యనారాయణ, విద్యార్థి నాయకులు రీనా, బిందు తదితరులు పాల్గొన్నారు. **సామర్లకోట** యుటిఎఫ్ మండల అధ్యక్షురాలు ఎంబిఎస్.దేవి ఆధ్వర్యంలో మాధవపట్నంలో ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మహిళా టీచర్లు లక్ష్మి, సూర్య, యుటిఎఫ్ నాయకులు బ్రహ్మానందం, సూర్యనారాయణ, సాయి, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పెద్దాపురం** పట్టణ యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పట్టణ మహిళా అధ్యక్షులు బేబీ రత్నం, మహిళా కార్యదర్శి ఎన్.పద్మావతి, జిల్లా కౌన్సిలర్ ఎస్.సత్యవేణి, అధ్యక్షులు జయరాజు, ప్రధాన కార్యదర్శి మధుకుమార్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన మరో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

జాతీయ రహదారిపై చొప్పెల్ల వద్ద రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడగా చికిత్స పొందుతున్న వారిలో మరో వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు. జాతీయ రహదారిపై మండలంలోని చొప్పెల్ల డివైడర్ వద్ద శనివారం ఒక ఇటుక వ్యాన్ అదుపు తప్పిన సంఘటనలో చొప్పెల్లకు చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని రాజమహేంద్రవరం ప్రభుతాస్పత్రికి తరలించారు. వీరిలో అడబాల సత్యనారాయణ (57) ఆదివారం మృతి చెందగా, సోమవారం ఆకుల వెంకన్న (45) మృతి చెందాడు. మరో క్షతగాత్రుడు చిక్కిరెడ్డి రాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

చోరీ కేసుల్లో మహిళ అరెస్టు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వివిధ చోరీ కేసులకు సంబంధించి మహిళను అరెస్టు చేశామని ఎస్‌పి నరసింహకిశోర్ తెలిపారు. అంగరకు చెందిన నడిపల్లి సూర్యచంద్రచక్ర జగదాంబ అలియాస్ బుజ్జి ప్రస్తుతం బొమ్మూరు పెట్రోల్ బంక్ సమీపంలో చెరువుగట్టువద్ద గల ఇంట్లో నివాసం ఉంటుందన్నారు. ఒంటరిగా ఉండే వృద్ధులు ఉంటున్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతుందన్నారు. వృద్ధులతో పరిచయం ఏర్పరుచుకుని పనిమనిషిగా వారి ఇళ్లలో చేరుంతుందన్నారు. వారికి ఆహారంలో నిద్రమాత్రలు కలిపి ఇస్తుందని, వారు స్పృహ కోల్పోయిన తరువాత ఇంట్లో ఉన్న బంగారు వస్తువులను దొంగిలించుకుని పోతుందని తెలిపారు. గతంలో 16 కేసుల్లో నిందితురాలిగా ఉందన్నారు. పది కేసుల్లో జైలు శిక్ష అనుభవించిందన్నారు. 2021లో జైలు నుంచి విడుదలైందన్నారు. అనంతరం ఇప్పటి వరకూ మరో 18 చోరీలు చేసిందన్నారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి, బిక్కవోలు, రాజానగరం, నిడదవోలు, కొవ్వూరు, ఉండ్రాజవరం, కాకినాడ, పెదపూడి, గండేపల్లి, కరప, భీమవరం జిల్లాలో తణుకు, తాడేపల్లిగూడెం పోలీస్ స్టేషన్లలో ఆమెపై కేసులు ఉన్నాయన్నారు. ఈ నెల 18న అనపర్తిలోని ఐఎల్‌టిడి బ్రిడ్జి వద్ద ఉండగా పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. ఆమె నుంచి ఆరు కేసులకు సంబంధించి 273.8 గ్రాముల బంగారు వస్తువులను రికవరీ చేశామని తెలిపారు. మో 12 కేసులకు సంబంధించి రికవరీ చేయాల్సి ఉందన్నారు. ఆమెను చాకచక్యంగా పట్టుకుని పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

గంజాయి స్వాధీనం ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

గంజాయిని తరలిస్తున్న ఏడుగురు నిందితులను అరెస్టు చేశామని సిఐ పి.విశ్వం తెలిపారు. సోమవారం కొవ్వూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సిఐ విశ్వం ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు గామన్ బ్రిడ్జి సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. ఒక కారును తనిఖీ చేయగా 25 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. కొవ్వూరు పట్టణానికి చెందిన కంచుబాని దినకరన్, భూపతి అశోక్, భూపతి హర్షవర్ధన్, కొరువాటి పోసికుమార్, మీసాల రవికుమార్, కడింపల్లి సిదార్ధ, చెట్టెబత్తుల హర్షవర్ధన్‌లను అరెస్టు చేశామన్నారు. విచారించగా ఐదు చోరీల్లో వారు నిందితులుగా ఉన్నారని తేలిందన్నారు. ు 25 కేజీల గంజాయితో పాటు కారు, రూ.11.80లక్షల విలువ చేసే చోరీ చేసిన సొత్తు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సిఐ వెంట కొవ్వూరు పట్టణ ఎస్ఐ జగన్మోహనరావు, ఎఎస్ఐ ప్రకాష్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, రామ్‌లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట - గోకవరం రోడ్ శివారు ఉన్న పోలవరం కాలువలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు స్థానిక ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. స్థానికులు అందించిన సమాచారంతో సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని వయసు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని, మృతుడు నలుపు రంగులో ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించి మృతుడి వివరాలను గుర్తు పట్టినట్లయితే 9440796569 నెంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

విద్యుదాఘాతానికి లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కాతేరులో విద్యుదాఘాతానికి గురై టిప్పర్ లారీ డ్రైవర్ మతి చెందాడు. సిఐ ప్రసన్నవీరయ్యగౌడ్ తెలిపిన వివరాల మేరకు తాళ్లపూడి మండలం మలకపల్లి చెందిన కొక్కెరపాటి రాజు(55) గౌరీపట్నం క్వారీ నుంచి ఆదివారం సాయంత్రం నల్లకంకర లోడుతో కాతేరులోని ప్రైవేట్ లే అవుట్‌లోకి వెళ్లాడు. అన్‌లోడ్ చేస్తుండగా లారీ హైడ్రాలిక్ లిఫ్ట్‌కి విద్యుత్ తీగలు తగలడంతో విద్యుత్ ఘాతానికి గురై రాజు అక్కడే మతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గోదావరిలో వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి - ఐ.పోలవరం

ఎదుర్లంక గోదావరిలో స్నానానికి వెళ్లిన వ్యక్తి గల్లంతైన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. దీనికి సంబదించిన పోలీసులు తెలిపిన వివరాలివి. ఐ.పోలవరం మండలం ఎదుర్లంక-భవాని పేట గ్రామానికి చెందిన పలివెల రామకృష్ణ ఎదుర్లంక గోదావరిలో స్నానం చేస్తుండగా మునిగిపోయాడు. అక్కడ ఉన్న స్థానికులు చూసి కాపాడాలని ప్రయత్నం చేసినప్పటికీ వీలుకాలేదు. రామకృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ బి.వెంకటేశ్వర్లు తెలిపారు.

30 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని గుర్రంపాలెం రోడ్డులో సారా తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ముందుస్తుగా వచ్చిన సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసినట్లు ఎస్ఐ టి.రాఘునాథరావు తెలిపారు. ఈ దాడిలో 12 డ్రమ్ములలో నిల్వ చేసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు వివరించారు. సారా తయారీ చేస్తున్న మునసా జియన్నను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండల పరిధిలో సారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్లాస్టిక్కు విసర్జించి మొక్కలను నాటలని విశ్వ మానవతా సంస్థ ఛైర్మన్ ఫౌండర్ అల్లూరి శ్రీనివాస్ చౌదరి పిలుపునిచ్చారు సోమవారం మండలంలోని వేట్లపాలెంలో శ్రీ రామకృష్ణ సేవా సమితిలో జరిగిన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే సంస్కార విద్యను, ఉత్తమ అలవాట్లను, క్రమశిక్షణను నేర్పించాలన్నారు. మొక్కలను నాటాలి పర్యావరణాన్ని పరిరక్షించాలని నినాదాలు చేస్తూ సైక్లింగ్ నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు కంటిపూడి గోపాలకృష్ణ, కందుల సత్యనారాయణ, జుజ్జవరపు వెంకట్రావు, కంటిపూడి బలరాం, యార్లగడ్డ సుబ్బారావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

జగ్గంపేట : స్థానిక ఎన్‌టిఆర్ కాంస్య విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో సోమవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ పాల్గొని అన్నదానంను ప్రారంభించారు. రామవరం గ్రామానికి చెందిన వత్సవాయి అనిరుధ్ వర్మ ఆర్థిక సాయంతో సోమవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసివేయడంతో టిడిపి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఈ అన్న క్యాంటీన్‌ను ప్రతీ సోమవారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, నీలం శ్రీను, దాత వత్సవాయి చిరంజీవిరాజు, రాయి సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ

పెదపూడి : పెదపూడి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా కె.రామారావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. చోరీల నియంత్రణకు, జూదం, తదితరాల నియంత్రణపై ఉక్కుపాదం మోపుతామన్నారు. సారా తయారీ, అమ్మకాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేటి నుంచి ఇంటింటా ఓటర్ల సర్వే

పెద్దాపురం : మండల పరిధిలోని 23 గ్రామాల్లో నేటి నుంచి అక్టోబర్ 18 వరకూ ఓటర్ జాబితాపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి తెలిపారు. సోమవారం 23 గ్రామాలకు సంబంధించిన బిఎల్‌ఒలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్వేలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటర్‌గా నమోదు చేయటం, మరణించిన ఓటర్‌లను తొలగించటం, ఓటర్ గుర్తింపు కార్డుల నమోదు, ఓటర్ కార్డు షిఫ్టింగ్‌లు చేస్తారన్నారు. ఇంటింటి సర్వేకు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కాంప్లెక్స్ సమావేశాల పరిశీలన

సామర్లకోట : మండలంలోని మాధవపట్నం ఉన్నత పాఠశాలలో జరుగుతున్న హిందీ కాంప్లెక్స్ సమావేశాన్ని ఎంఇఒ శివరామకృష్ణయ్య సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైన ఉపాధ్యాయులకు ఆయన పలు సూచనలు అందించారు. అలాగే నవర గ్రామంలోని జడ్‌పి ఉన్నత, ప్రాథమిక పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్‌ను ఎంఇఒ- 2 పి.పుల్లయ్య సందర్శించారు. ఎగ్జామినేషన్స్‌కి సిలబస్ పూర్తి చేసి పరీక్షలను పకడ్బంధీగా నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక రమణ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల ఫొటోగ్రాఫర్ల సంఘ అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు, ట్రస్ట్ ఛైర్మన్ అడబాల రత్నప్రసాద్ మాట్లాడారు. అనంతరం ఫొటోగ్రాఫర్లు కర్రి నాగేశ్వరరావు, జిజెవిఎస్‌వి.ప్రసాద్, శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, ఎస్.శ్రీనగేష్, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం రక్షాబంధన్ సందర్భంగా ఇంటిలో ఉన్న సోదరుడుకి రాఖీ కట్టి, కాకినాడ దుమ్ములపేటలో ఉన్న కజిన్ సోదరులకు రాఖీ కట్టేందుకు 5వ తరగతి విద్యార్థిని ఉప్పరపల్లి దేవి(11) కోనపాపపేట నుంచి వెళ్లింది. కాకినాడ నుంచి తిరిగి ఆటోలో వస్తుండగా మూలపేట సమీపంలో ట్రక్ ఆటో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. మరో నలుగురికి గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

సహజీవనం చేస్తున్న జంట ఆత్మహత్య

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట శివారు జగనన్న కాలనీలో సహజీవనం చేస్తున్న జంట ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక ఎస్ఐ రఘునాధరావు తెలిపిన ప్రకారం.. జగ్గంపేట టవర్ కాలనీకి చెందిన పిండి నానాజీ(25) రంగంపేట మండలం కోటపాడుకు చెందిన సాయిప్రసన్న(26)తో గత నాలుగేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. అయితే గత ఆరు నెలలుగా జగనన్న కాలనీలోని వేరువేరు ఇళ్ళల్లో అద్దెకు ఉంటున్నారు. ఇటీవలే మూడు నెలల క్రితం వచ్చిన ఇంట్లోకి వారు ఇరువురు మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా సాయి ప్రసన్న మనస్థాపానికి చెంది అదే ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందింది. ఈ సంఘటన చూసి తట్టుకోలేక నానాజీ అక్కడే ఉరేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం మట్లపాలెం వంతెన సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ద్విచక్ర వాహనంపై తాళ్ళరేవు నుంచి కాకినాడ వెళుతున్న వ్యక్తులను ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తాళ్లరేవుకు చెందిన జర ధనరాజు, అయినాపురంకు చెందిన పరమట నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు.

కొమరగిరి లేఔట్‌పై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - పిఠాపురం

కొత్తపల్లి మండలం కొమరగిరి గ్రామంలోని లేఅవుట్ భూసేకరణలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్‌ఎస్.వర్మ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేద్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ వద్ద టిడిపి శ్రేణులు మత్స్యకారులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ కొమరగిరి, ఉప్పాడ, అమీనాబాద్, మూలపేట గ్రామాలకు చెందిన మత్స్యకారులు, అర్హులైన వారికి ఇళ్ళ స్థలాల కొరకు టిడిపి పాలనలో కెఎస్ఇజెడ్‌లో 80 ఎకరాలు డి-నోటిఫికేషన్ చేయించేందుకు సిఫార్సు చేయడం జరిగిందన్నారు. అనంతరం వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కాకినాడలో నివసించే వైసిపి కార్యకర్తలు కొరకు 350 ఎకరాలు సేకరించి 13000 పట్టాలుగా కొమరిగిరిలో లే-అవుట్ చేయడం జరిగిందన్నారు. కొమరగిరి గ్రామంలోని ఇళ్ళు లేని పేదవాళ్ళకి పట్టాలు ఇవ్వలేదని ఇచ్చిన వాటిలో సుమారు 300 నుంచి 400 ఇళ్లు మాత్రమే కట్టి మిగిలిన, వేల పట్టాలు అన్నీ కూడా బినామీలతో అమ్ముకోవడం జరిగిందని ఆరోపించారు. దానిపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

సకాలంలో పరిష్కారం చూపాలి కమిషనర్ భావన

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని కమిషనర్ వి.భావన ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని, అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఇంజనీరింగ్, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్, యూపీఏ విభాగాలకు సంబంధించి 18 మంది ఫోన్ ద్వారా సమస్యలు విన్నవించారు. అలాగే పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క దరఖాస్తుకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఇ వెంకటరావు, ఇఇ మాధవి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, డిసిపి హరిదాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఉద్యాన సహాయ సంచాలకులు టివి.శిరిల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 20 అర్జీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డివిజన్ పరిధిలో 20 అర్జీలు అందాయని ఆర్‌డిఒ జె.సీతారామారావు తెలిపారు. డివిజన స్థాయిలో నిర్వహించే ఈ గ్రీవెన్స్‌కు అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. వచ్చిన అర్జీలన్నీ ఆయా శాఖల అధికారులకు పంపించి నిర్ణీత సమయంలో పరిష్కరించి అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ బాలామణి, సిడిపిఒ ఉషా, డిప్యూటీ తహశీల్దార్ భాను కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లోకి నీరు మళ్లించాలి

ప్రజాశక్తి - యానాం

గోదావరి నీటిని పంట కాలువల్లోకి మళ్లించాలని రైతులు కోరుతున్నారు. సోమవారం సీతారామనగర్ పంపు హౌస్‌ను రైతులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘ అధ్యక్షుడు తిరుకోటి భైరవమూర్తి, సబ్బతి లోకేశ్వరరావు, రాంబాబు, మట్టా రాంబాబు మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదలతో వేసిన నారుమళ్లు దెబ్బతిన్నాయని, ప్రస్తుతం తిరిగి నారుమళు వేసుకునేందుకు నీటి వసతి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సీతారామనగర్ వద్ద ఉన్న పంపు హౌస్ ద్వారా గోదావరి నీటిని పంట కాలువల్లోకి నీటిని ఎత్తిపోసి పంటల సాగుకు సహకరించాలని రైతులుకోరుతున్నారు.

ప్రకటన

రాజమండ్రి, కోటగుమ్మం కాపురస్తులు **"గొల్లపూడి వీరాస్వామి"** పుస్తక ప్రచురణ, విక్రేతలు అయిన ప్రొ॥ **గొల్లపూడి వెంకట రామ మహాలక్ష్మి** గారు ఎల్లరకు తెలియజేయునది.

మా సంస్థ విశాఖపట్టణం కాపురస్తులు (లేటు) **డా॥ యళ్ళాయి నారాయణరావు** గారిచే రచింపబడిన ఈ దిగువ పుస్తకములకు వారి వారసులు నుండి **1. వారి భార్య యళ్ళాయి సుజాత, 2. కుమారుడు యళ్ళాయి రవిశంకర్ 3. కుమార్తె** భ్రమరావాసిని ల నుండి **1. భవిష్యపురాణము 2. శివపురాణము 3. గరుడపురాణము** " కాపీరైట్ " హక్కులను పొంది యున్నాము. కావునా సదరు పుస్తకములు ఇతరులు ఎవరూ ప్రచురించరాదని, మరియు నకలు పుస్తకములు తయారుచేసి విక్రయించరాదని, ఇందుమూలముగా తెలియపర్చడమైనది. ఇందుకు తప్పిన యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోబడును.

ఇట్లు
గొల్లపూడి వెంకట రామ మహాలక్ష్మి
ప్రొప్రైటర్ గొల్లపూడి వీరస్వామి పుస్తక ప్రచురణ
రాజమండ్రి
రాజమండ్రి
ది. 19-8-2024

చెక్‌పోస్ట్ సిబ్బంది కీలకపాత్ర పోషించాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ పోర్టులో అక్రమ బియ్యం తరలింపు నియంత్రించడంలో చెక్ పోస్టు సిబ్బంది అత్యంత కీలకమైన పాత్ర పోషించాలని కలెక్టర్ షాన్ మోహన్ అన్నారు. సోమవారం చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిఎస్‌డిటిలు, ఆర్ఐలు, విఆర్ఒలు, టెక్నికల్ సిబ్బందితో ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, పౌరసరఫరాలు, పోలీస్, పోర్టు అధికారులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ పోర్టుకు సంబంధించి నిత్యం ఇతర దేశాలకు వివిధ రకాల ఎగుమతులు జరుగుతుంటాయన్నారు. పోర్టులో జరిగే ఎగుమతుల్లో బియ్యం ఎగుమతులే అధిక శాతం ఉంటాయన్నారు. పౌరసరఫరాల శాఖ ద్వారా పేదలకు అందిస్తున్న బియ్యాన్ని అక్రమంగా రీసైకిలింగ్ చేసి ఇతర దేశాలకు తరలిస్తున్నారని, ఈ నేపథ్యంలో కాకినాడ పోర్ట్‌లో అక్రమ బియ్యం ఎగుమతులను అరికట్టే చర్యల్లో భాగంగా బొంబాయి కాట, శక్తి గేట్ వద్ద రెండు చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాకినాడ పోర్టు నుంచి అక్రమ బియ్యం ఎగుమతులు నియంత్రించేలా చెక్ పోస్ట్ ల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అత్యంత కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవి.ప్రసాద్, డీఎం ఎం.బాలసర్వతి, ఆర్‌డిఒ ఇట్ల కిషోర్, కాకినాడ పోర్టు అధికారి కె.ధర్మశాస్త్ర, కాకినాడ అర్బన్ తహశీల్దార్ జితేంద్ర పాల్గొన్నారు.

ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల కేంద్రమైన జగ్గంపేట ఆర్టీసి బస్టాండ్ సోమవారం ప్రయాణికులతో కిక్కిరిసింది. రక్షా బంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాఖీలు కట్టేందుకు తమ తమ పుట్టిల్లకు ప్రయాణాలు సాగించారు. అసలే సోమవారం వారపు సంత కావడంతో సంతకు వచ్చే వారు, ప్రయాణికులు, కాలేజి విద్యార్థులు అందరితో కిక్కిరిసింది. మరోపక్క కాకినాడ నుంచి రాజమహేంద్రవరం వెళ్ళే రోడ్ అధ్వానంగా ఉండడంతో అటుగా ప్రయాణించే వాహనాలు జగ్గంపేట మీదుగా వెళ్తున్నాయి. దీంతో జగ్గంపేటలో ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రాజానగరం జిఎస్‌ఎల్ ఆసుపత్రి వైద్యులు స్థానికంగా సోమవారంఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, కళ్ళజోళ్ళు అందజేశారు. 20 మందిని ఐఒఎల్ ఆపరేషన్ నిమిత్తం తరలించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ వరప్రసాద్ తనూజ నాయుడు మాట్లాడుతూ వర్షాకాలంలో కంటికి వచ్చే జబ్బులపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కన్ను ఎర్రబడిన, కంటిలో నలకబడిన సొంత వైద్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరరాఘవస్వామి, కె.పావని సత్య సింధూర, ఎడివి.ప్రసాద్, టి.గుర్రయ్య, రమణారావు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 21న దేశవ్యాప్తంగా నిర్వహించే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మండల దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక అంబేద్కర్ భవనం వద్ద విలేకరుల సమావేశంలో జక్కల ప్రసాద్‌బాబు, కాశి లక్ష్మణస్వామి, మోర్త భైరవమూర్తి, దడాల బుజ్జిబాబు మాట్లాడారు. బంద్ సందర్భంగా ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు, వర్తక సంఘాలు బంద్ విజయవంతానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్బతి శ్రీనివాస రావు, వాకపల్లి చిట్టిబాబు, వాకపల్లి అంబేద్కర్, మేడపాటి దేవానంద్, పెయ్యల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సారాను అరికట్టాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - పిఠాపురం

నియోజవర్గంలో సారాను అరికట్టాలని మద్యం మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ, జన విజ్ఞాన వేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పిజిఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గంలో సారా ఏరులై పారుతున్న అరికట్టడం లేదన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే కలెక్టర్‌కు మూడుసార్లు వినతిపత్రం అందజేసిన నేటికీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం వలన మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

లైన్‌మేన్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లేపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ లైన్‌మేన్‌గా ఉత్తమ సేవలందించిన పాకలపాటి శ్రీనివాస్‌రాజును సోమవారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి కట్టా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు చేతుల మీదుగా రాజుకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రామకుర్తి నాగేశ్వరరావు, గొల్లవిల్లి లోవ రామకృష్ణ, దార్లంక నూకరాజు, లైన్‌మేన్ మైలవరపు మణికంఠ, అసిస్టెంట్ లైన్‌మేన్ దోనాద్రి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

బోగస్ ఓట్లు తొలగించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఆగస్ట్ 20 నుంచి అక్టోబర్ 18 వరకూ నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో బోగస్ ఓట్లను తొలగించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు సోమవారం ఓ క్రటనలో డిమాండ్ చేశారు. స్థానికంగా పోలింగ్ కేంద్రాల ఇంటి నెంబర్‌లో నివాసం లేని వ్యక్తుల కుటుంబాల పేర్లు తొలగించాలని కోరారు.

పాస్‌పోర్టు పడిపోయినది

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం అల్లవరం గ్రామం మొల్లేటి వారి పాలెంకు చెందిన మొల్లేటి శ్రీనివాస్ S/o. గంగిశెట్టి కు చెందిన పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్ట్ నెంబర్ **B0715440.** ది.02-03-2024 తేదీన జిరాక్స్ నిమిత్తం మొల్లేటి వారి పాలెం నుండి అల్లవరం సెంటర్‌కు వెళ్ళుతుండగా మార్గం మధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

మొల్లేటి శ్రీనివాస్
S/o. గంగిశెట్టి, డోర్ నెంబర్ 7-63
మొల్లేటి వారి పాలెం, అల్లవరం
సెల్:9573199921

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 161 / 2024
Between:
Kattinokkula Suryaprakasamma, W/o. Late Venkateswara Rao, Hindu, aged about 72 years, R/o.D.No.104-7-129, Nagireddy Nagar, Hukumpeta, Rajahmundry Rural, East Godavari District, A.P
...Plaintiff
AND
Palukuri Srinivasa Rao, S/o. Suryanarayana, Hindu, aged about 55 years, D.No.4-86, Panchayat Street, Veeravaram Village, Kadiyam Mandal, East Godavari District. Presently residing at D.No.104-7-485, Adarsa Nagar, Hukumpeta, Rajahmundry Rural, East Godavari District, A.P
....Deffendent

పై నంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు / నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావునా ది. **29-08-2024** సం॥రం తేదీ ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు ఫైదావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి — **అవధానుల సుబ్బారావు**
19-08-2024 — అడ్వకేటు, రాజమండ్రి

ప్రకటన

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో (సీనియర్ డివిజన్)
EP 13/2017 OS 298/2008
DHR : శ్రీమతి తెలగారెడ్డి పద్మావతి, W/o **శ్రీనివాసరావు, వయస్సు 36 సం॥, స్త్రీ,** House Wife and Propartion, గోపవరం, నిడదవోలు మండలం, తూ॥గో॥జిల్లా ...NDD JCJC.
Vs
JDRS :1). శ్రీమతి గుంటూరు సామ్రాజ్యం (Died)
2) శ్రీ గుంటూరు సత్యనారాయణ రెడ్డి వగయిరా
4th JDRS: శ్రీ గుంటూరు తిరుమలారెడ్డి, S/o **సత్యనారాయణ రెడ్డి,** హిందూ, వయస్సు 40 సం॥, ప్రైవేట్ ఎంప్లాయి, కుమ్మరి వీధి, నిడదవోలు, నిడదవోలు మండలం, తూ॥గో॥జిల్లా ..NDD JCJC
ఈ నెంబరులో వేలం నోటీసు 4వ JDRకు కోర్టు ద్వారాను మరియు Regd Post ద్వారాను అనేక పర్యాయములు పంపించిననూ అమలు జరుగనందున శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం ఈ ప్రకటన వేయడమైనది.
ఈ నెంబరులో 4వ JDR శ్రీ గుంటూరు తిరుమలారెడ్డి S/o నత్యనారాయణ రెడ్డి, నిడదవోలు అనువారు **ది.2-9-2024వ తేదీ ఉదయం గం॥10.30 లకు** శ్రీ కోర్టు వారు పిలిపించే టైముకు స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలియపరచుకొనవలెను. లేని యెడల Expartee చేసి పరోక్షమున తీర్మానించడమగును.
వాయిదా : 2-9-2024
P. VENKANNA BABU
Advocate
Nidadavole, E.G.Dt
Cell : 93476 26143

ఒరిజినల్ దస్తావేజులు పడిపోయినవి

నా క్లయింట్ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కాపురస్థులు (లేటు) రామకృష్ణా రెడ్డి కుమార్డు సత్తి వెంకట రెడ్డి గారి తరుపున ఇచ్చు ప్రకటన. ప్రకటన ఏమి అనగా
నా క్లయింట్ ఆస్తికి సంబంధించిన దస్తావేజులు అనగా కాతేరు గ్రామం తాలుకు సర్వే **నెం. 246 లో** చ.గ. **392** ల్కు సంబందించిన ఆస్థి స్థలం బడుగు దొరబాబు గారి వద్ద నుండి క్రియం పొంది ది. **01-02-2023**వ రాజమహేంద్రవరం సబ్-రిజిస్ట్రార్ ఆఫిసులో దస్తావేజు నెం. **386/2023** రిజిష్టీ పొందినయున్నారు. సదరు రిజిష్టీ దస్తావేజు మరియు దానికి సంబంధించిన లింకు డాక్యుమెంట్స్ తీసుకొని ప్రకాష్‌నగర్ నందు గల జిరాక్సు సెంటర్ వద్దకు వెళ్లి జిరాక్సు తీయించుకొని వస్తుండగా మార్గ మధ్లో పిడింగొయ్యి ఎస్.ఆర్.ఒ. డాక్యుమెంట్ నెం. **8816/2013** ఎస్.ఆర్.ఒ. రాజమహేంద్రవరం నెంబరు గల డాక్యుమెంట్ పడిపోయినవి. ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు అందజేయగలరు.
(సత్తి వీరరాఘవ రెడ్డి)
అడ్వకేటు
రాజమహేంద్రవరం — రాజమహేంద్రవరం
తేది: 19-08-2024 — సెల్. 9346322113

PUBLICATION
IN THE COURT OF THE HON'BLE II ADDL DIST COURT : Dr. B. R. AMBEDKAR KONASEEMA DIST: AMALAPURAM
ARBEP No.641 of 2023 In AC No: 790 of 2012
Between:
Shriram Transport Finance Co., Ltd. Amalapuram Branch, rep by its GPA holder **K.V.Sekhar** ...D.Hr.
Vs
Satya Prasad Vittanala & another ...J.Drs
1st JDr: Satya Prasad Vittanala, D.No.1-45, Kothalanka, Mummidivaram.
The above named D Hr company has instituted the above ARBEP against you, and the same stands posted to **23-08-2024** at **10.30 A.M.** for your appearance, you are hereby required to appear personally or through advocate attend before this Hon'ble court at 10.30 AM and file your objections if any, failing which the matter will be heard and determined in your absence exparte as per Law.
//by the orders of the Hon'ble court//
V.K.S.Bhaskara Sastri,
Amalapuram — Advocate, Amalapuram
Dt.19-08-2024 — Cell: 81215 50987

PUBLICATION
IN THE COURT OF THE HON'BLE II ADDL DIST COURT : Dr. B. R. AMBEDKAR KONASEEMA DIST: AMALAPURAM
EP No.702 of 2023 In AC No: 119 of 2022
Between:
Shriram Transport Finance Co., Ltd. Amalapuram Branch, rep by its GPA holder **B.Srinivas Reddy, Amalapuram** ...D.Hr.
Vs
Jakkapu Venkata Durga Prasads & another ..J.Drs
1st JDr: Jakkapu Venkata Durga Prasad, S/o. Srinivas, D.No.10-2-39, Vanteddu vari Street, Amalapuram.
2nd JDr: Nandyala Naga Varalakshmi, W/o. Nageswara Rao, D.No.9-49/1, Gudala, Allavaram (V) (M).
3rd JDr: Bonthu Suresh Babu, S/o. Venkateswa Rao, R/o. Thondavaram, Ambajipeta (V) (M).
The above named D Hr company has instituted the above EP against you, and the same stands posted to **22-08-2024** at **10.30 A.M.** for your appearance, you are hereby required to appear personally or through advocate attend before this Hon'ble court at 10.30 AM and file your objections if any, failing which the matter will be heard and determined in your absence exparte as per Law.
//by the orders of the Hon'ble court//
V.K.S.Bhaskara Sastri,
Amalapuram — Advocate, Amalapuram
Dt.19-08-2024 — Cell: 81215 50987